నమస్తే తెలంగాణ నిజామాబాద్, గురువారం 26 సెప్టెంబర్ 2024
THURSDAY, SEPTEMBER 26, 2024

విద్యుత్ శాఖ అధికారుల 'రైతు పొలంబాట'

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 25 : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లిలో ట్రాన్స్‌కో ఏఈ సాయిలు ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పొలాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. పలు సమస్యలను తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించారు.

ఖిల్లా జైలును సందర్శించిన విద్యార్థులు

ఖిల్లా జైలును సందర్శిస్తున్న విద్యార్థులు

సారంగాపూర్, సెప్టెంబర్ 25 : నగరంలోని ఖిల్లా జైలును క్షేత్ర పర్యటనలో భాగంగా సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థులు బుధవారం సందర్శించారు. దాశరథి కృష్ణమాచార్యులు శిక్ష అనుభవించిన 8 నంబర్ బరాక్‌ను సందర్శించారు. ఖిల్లా జైలు విశిష్టతను ఉపాధ్యాయులు ఘనపురం దేవేందర్, ఎస్. గంగాధర్, స్వరూప విద్యార్థులకు వివరించారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

కోటగిరి, సెప్టెంబర్ 25 : మండలంలోని సుద్దులం గ్రామానికి చెందిన గర్భిణి స్వాతిక బుధవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించినట్లు ఈఎంటీ గంగారాం, పైలెట్ ఖలీం తెలిపారు. స్వాతికకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు కాల్ చేశారు. అంబులెన్స్‌కు గ్రామానికి చేరుకొని గర్భిణిని డెలివరీ కోసం కోటగిరి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా ఎక్లాస్‌పూర్ క్యాంప్ సమీపంలో పురిటినొప్పులు తీవ్రమయ్యాయి. సాత్విక మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీ బిడ్డను కోటగిరి సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగావకాశం కల్పించాలి

ఇందల్వాయి/ పొతంగల్/జక్రాన్‌పల్లి/ఎడపల్లి, సెప్టెంబర్ 25 : వీఆర్ఏలుగా విధులు నిర్వర్తించి మృతిచెందిన వారి వారసులకు, గ్రామసేవకులుగా పనిచేస్తూ 60 ఏండ్లు నిండిన వారి వారసులకు ఉద్యోగావకాశం కల్పిస్తూ నియామకపత్రాలు అందజేయాలని వీఆర్ఏలు కోరారు. ఈ మేరకు వీఆర్ఏలు పలు మండలాల తహసీల్దార్లకు బుధవారం వినతిపత్రాలను అందజేశారు. ఇందల్వాయిలో తహసీల్దార్ వెంకట్రావుకు, పొతంగల్‌లో తహసీల్దార్ మల్లయ్యకు, జక్రాన్‌పల్లిలో తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఎడపల్లి తహసీల్దార్ దన్వాల్‌కు వీఆర్ఏ వారసులు వినతి పత్రం అందజేశారు.

28న అండర్ 17 పుట్‌బాల్ పోటీలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 25 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ -నిజామాబాద్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని నాగారంలో గ్రౌండ్‌లో అండర్ -17 బాలబాలికల పుట్‌బాల్ పోటీలను ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, విద్యార్థులు తమ వెంట బోనాఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9347216426 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

జోరుగా 'స్వచ్ఛతా హీ సేవా'

నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ మకరంద్, సిబ్బంది

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 25 : జిల్లావ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పారిశుద్ధ్య కార్యక్రమాలను అధికారులు బుధవారం పరిశీలించారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మకరంద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా -హీ-సేవా ప్రతిజ్ఞ చేశారు. ధర్పల్లి మండలకేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, గ్లౌజులతో కూడిన పారిశుద్ధ్య కిట్లను ఎంపీడీవో బాలకృష్ణ అందజేశారు. అనంతరం సీతాయిపేట్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి సైపుద్దీన్, పారిశుద్ధ్య సిబ్బంది గంగాధర్, శ్యామేందర్, రాజేందర్ పాల్గొన్నారు. మోస్రా పీహెచ్‌సీ పరిధిలోని ఐదు గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు వైద్యుడు విజయ్‌కుమార్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో నీలావతి, ఎంపీవో మధురిమ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లోని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది డాక్టర్ సుశాంత్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. చేతులు శుభ్రపర్చుకునే విధానం, పనిచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్, డాక్టర్ మానస, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఫార్మాసిస్ట్ విజయలక్ష్మి, ఆనంద్, స్టాఫ్ నర్సులు గంగామణి, ప్రకాశ్ పాల్గొన్నారు. రుద్రూర్, వర్ని మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల్లో పారిశుద్ధ్య సిబ్బందికి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, ఎంపీవో లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లి గ్రామాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డు, కంపోస్ట్ షెడ్డు, నర్సరీలు, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు. ఏర్గట్ల మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఎంపీడీవో వెంకటేశ్వర్లుతో వైద్య సిబ్బంది చేపట్టిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. బోధన్ పాన్‌గల్లీ పీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నందిపేట్ ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, వైద్యులు ప్రవీణ్ ఆధ్వర్యంలో మండలంలో జీపీ కార్యదర్శులు జీపీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ హైవే వద్ద డంపింగ్ యార్డు ఆవరణలో మున్సిపల్ కమిషనర్ మొక్కలు నాటారు.

యువత క్రీడల్లో పాల్గొనాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌డ్డి

కంఠేశ్వర్, సెప్టెంబర్ 25 : యువత క్రీడల్లో పాల్గొనాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న డీఎస్ స్మారక క్రీడాపోటీలను ఆయన బుధవారం సందర్శించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇందల్వాయి, సెప్టెంబర్ 25 : మండలంలోని గంగారాం తండా వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మహేశ్‌కుమార్ తెలిపారు. 7.73 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా పోషణ్ అభియాన్

రుద్రూర్/ డిచ్‌పల్లి, సెప్టెంబర్ 25 : రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై సీడీపీవో జానకమ్మ అవగాహన కల్పించారు. బోధన్ సూపర్‌వైజర్ ఆసియాబేగం, కో-ఆర్డినేటర్ నరేశ్, పీహెచ్‌ఎన్ కృష్ణవేణి పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో నిర్వహించారు. 6 నెలలు నిండిన పిల్లలకు ఆమె అన్నప్రాసన చేయించారు. అంగన్‌వాడీ సిబ్బంది శ్రీలత, విజయ, ఆశవర్కర్ సుజాత పాల్గొన్నారు.

టీయూలో వర్క్‌షాప్

సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 25 : టీయూ కామర్స్ విభాగంలో క్లిక్ లెర్న్ టిచ్‌లో భాగంగా బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ యాదగిరి హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానికనుగుణంగా అధ్యాపకులందరూ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అకౌంటింగ్‌లో సాఫ్ట్‌వేర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హారతి, మల్లేశం గుప్తా, రాంబాబు, జగదీశ్, శ్రీనివాస్, శ్వేత, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు

- యువకుడిపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 25 : నిజామాబాద్ నగరంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికను ప్రేమపేరుతో వేధింపులకు గురిచేసిన పోకిరీపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉండే యువకుడు సునీల్ బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురిచేశాడు. బాలిక కుటుంకుసభ్యుల ఫిర్యాదుతో సునీల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంఈవోల నియామకం

డిచ్‌పల్లి/ కోటగిరి/ చందూర్/ సిరికొండ/ రుద్రూర్/ మోర్తాడ్/ ఏర్గట్ల/ వేల్పూర్/ బోధన్ రూరల్, సెప్టెంబర్ 25 : పలు మండలాల విద్యాధికారులను నియమిస్తూ డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యానంపల్లి పీజీహెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డిని డిచ్‌పల్లి ఎంఈవోగా, చందూర్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డిని ఇన్‌చార్జి ఎంఈవోగా, కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎన్. శ్రీనివాసరావును ఇన్‌చార్జి ఎంఈవోగా, తూంపల్లి హెచ్ఎం రాములుకు సిరికొండ ఇన్‌చార్జి ఎంఈవోగా, రుద్రూర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌కు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. మోర్తాడ్ ఎంఈవోగా సమ్మిరెడ్డి, ఏర్గట్ల ఎంఈవోగా బి.ఆనంద్‌రావు, వేల్పూర్ ఎంఈవోగా రేణుక, సాలూరా ఎంఈవోగా రాజిమాజుష నియమితులయ్యారు. నిజామాబాద్ సౌత్ ఎంఈవోగా సాయిరెడ్డి, నార్త్ ఎంఈవో వెంకటనారాయణగౌడ్, నిజామాబాద్ ఎంఈవోగా గేమ్సింగ్ బాధ్యతలు చేపట్టారు.

సంక్షిప్తంగా..

- **విద్యార్థులకు షూస్, సాక్స్ అందజేత** - సారంగాపూర్, సెప్టెంబర్ 25 : రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ -నిజామాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లారం జడ్పీహెచ్ఎస్‌లో 272 మంది విద్యార్థులకు షూస్, సాక్స్‌లను బుధవారం అందజేశారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు తను రచించిన మూలకాల పెట్టే భక్తి మాలిక, సైన్స్ బాల వినోదిని పుస్తకాలను క్లబ్ సభ్యులకు అందించారు.
- **వరి పంటల పరిశీలన** - సారంగాపూర్, సెప్టెంబర్ 25 : మండలంలోని ఖానాపూర్, కాలూర్ గ్రామశివారులోని వరి పొలాలను మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్, ఏఈవో స్వాతిలత బుధవారం పరిశీలించారు. వరి పంటకు ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.
- **రోటరీ క్లబ్ సభ్యుల సమావేశం** - ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 25 : నగరంలోని ఓ హోటల్‌లో రోటరీ క్లబ్ సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపర్చాలని సూచించారు. సమావేశంలో రోటరీ సభ్యులు ఆకుల అశోక్, జ్ఞానప్రకాశ్, పద్మ శ్రీనివాస్, గౌరీశంకర్ పాల్గొన్నారు.
- **స్నేహ సొసైటీలో ఆరోగ్య శిబిరం** - ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీలో బుధవారం ఆరోగ్య శిబిరంలో భాగంగా డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. 13 మంది అంధ విద్యార్థులకు టాకింగ్ గడియారాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సిద్ధయ్య, సభ్యులు శ్యాంసుందర్ లడ్డా, జ్యోతి, బాబాగౌడ్, జీవన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, దివ్యాంగులు, పాల్గొన్నారు.
- **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం** - రుద్రూర్, సెప్టెంబర్ 25 : వర్ని మండలం కోటయ్య క్యాంపునకు చెందిన సాయిలు ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్ బుధవారం రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.
- **బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా శంకర్‌రెడ్డి** - సారంగాపూర్, సెప్టెంబర్ 25 : మండలంలోని గుండారం తాజా, మాజీ ఉపసర్పంచ్ ఒంటెల శంకర్‌రెడ్డి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నియామకమయ్యారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ ఆయనకు బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు.
- **అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి** - డిచ్‌పల్లి, సెప్టెంబర్ 25 : టీయూలో 2014లో నియామకమైన అధ్యాపకులకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను అమలుపరుస్తూ పదోన్నతులు కల్పించాలని టీయూ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. టీయూలో టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పున్నయ్య అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానకార్యదర్శి డాక్టర్ మోహన్‌బాబు మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వులు అమలు చేస్తూ అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని వర్సిటీ అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 25 : రోడ్డుప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులతో సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించాలన్నారు. డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని అన్నారు.

అట్టహాసంగా 'ఎలిగ్నర్ ఫెస్ట్'

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 25 : నగరంలోని వైద్యకళాశాలలో 'ఎలిగ్నర్ ఫెస్ట్'ను బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి, ఎలిగ్నర్ ఫెస్ట్ లోగో, టీషర్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా ముఖ్యమన్నారు. వైద్య విద్యార్థుల కోసం ఆటస్థలం, జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆరు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జలగం తిరుపతి, డాక్టర్ నాగమోహన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

రెంజల్, సెప్టెంబర్ 25: గతేడాదికి సంబంధించిన మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ బుధవారం మండలం కేంద్రంలోని ఎమ్మార్సీలో మధ్యాహ్న భోజన ఏజెన్సీసీ నిర్వాహకులు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా ఆదనపు బడ్జెట్ కేటాయించాలని, గృహలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్ వర్తింప జేయాలని, కనీస గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని పలు డిమాండ్ చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు లక్ష్మి, శిరీష, సావిత్రి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 25: బోధన్ పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో మెస్సెంజర్‌గా విధులు నిర్వహించే ఇమాం అనే వ్యక్తి గత నెల నిజామాబాద్ వెళ్లి వస్తూ బోధన్‌లో వాహనం ఢీకొట్టి గాయాల పాలయ్యాడు. కాగా, ఆయనకు షుగర్ కారణంగా గాయాలు మానకపోవడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన ఇమాంను పరామర్శించిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, సాంస్కృతిక కార్యదర్శి బాబు, బోధన్ డివిజన్ అధ్యక్షుడు యూసుఫ్ అలీ, పలువురు ఉపాధ్యాయుల ద్వారా అందించిన రూ. 21,111లను ఇమాం సతీమణికి అందజేశారు. ఈనెల 20, 24వ తేదీల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం సందర్భంగా ఉపాధ్యాయులకు ఇమాం విషయంలో ఎంఈవో నాగనాథ్, మండల నోడల్ అధికారి నాగయ్య వివరించడంతో ఉపాధ్యాయులు తమవంతుగా సహకారం అందజేశారు. తనకు ఆర్థిక సాయం చేసిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో పాటు పలువురికి ఇమాం కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు ప్రారంభం

మోర్తాడ్, సెప్టెంబర్ 25: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మినిస్టేడియంలో గురువారం ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే మండల అంతరపాఠశాలల క్రీడోత్సవాలు, మార్చ్‌పాస్ట్ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జయప్రదం చేయాలి

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 25: పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు కోరారు. బుధవారం బోధన్ పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్. అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్25: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అందరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.

'రైతు భరోసా' అందజేయాలి

ఎడపల్లి, సెప్టెంబర్ 25: రైతు భరోసా డబ్బులు అందజేయాలని కోరుతూ తహసీల్ కార్యాలయంలో సీపీఐఎంఎల్ బోధన్ డివిజన్ నాయకుడు గుమ్ముల గంగాధర్ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ అనూషకు వినతి పత్రం అందజేశారు. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతి రాజేశ్వర్, కాశరవి, శ్రీపతి మల్లేశ్, కొండా లక్ష్మణ్ పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో రుణమాఫీ కోల్పోయాం

మాట్లాడుతున్న చైర్మన్ బురోల్ల అశోక్

మాక్లూర్, సెప్టెంబర్25: సొసైటీలో బకాయిలున్న లక్షల రూపాయలను రెండు నెలల్లో సొసైటీకి చెల్లిస్తామని సంఘంలో బకాయి ఉన్న సిబ్బంది, డైరెక్టర్లు రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం మండల కేంద్రంలో చైర్మన్ బురోల్ల అశోక్ అధ్యక్షతన 85వ విండో మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. సంఘ కార్యదర్శి ప్రవీణ్ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. సొసైటీ సిబ్బంది, కొందరు డైరెక్టర్లు అనామత్ పద్దుల కింద లక్షల రూపాయలు వాడుకోవడం ఎమిటని రైతులు ప్రశ్నించారు. దీంతో రెండు నెలల్లో బకాయిలు చెల్లిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ శేఖర్, సీఈవో ప్రవీణ్, మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ కొనిచ్చిన ఉపాధ్యాయుడు

విద్యార్థినికి సైకిల్‌ను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మోర్తాడ్, సెప్టెంబర్ 25: ఓ పేద విద్యార్థినికి ఉపాధ్యాయుడు సైకిల్ కొనుగోలు చేసి ఇచ్చి ఉదారత చాటుకున్నారు. సుంకెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ధనలక్ష్మి రోజూ రెండు కిలో మీటర్ల దూరం నుంచి నడుచుకుంటూ వస్తున్నంది. ఈవిషయాన్ని గమనించిన ఆ పాఠశాల హెచ్ఎం పెద్ది సంతోష్ సైకిల్‌ను కొనుగోలు చేసి బుధవారం అందజేశారు. తనకు ఉద్యోగోన్నతి వచ్చి ఏడాది గడుస్తున్న సందర్భంగా ఎవరికైనా సహాయం చేయాలనే ఆలోచనతో విద్యార్థినికి సైకిల్‌ను కొనిచ్చానని అన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ వితరణ

మోర్తాడ్, సెప్టెంబర్ 25: కమ్మర్‌పల్లిలో గురువారం ప్రారంభమయ్యే మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో పాల్గొనే విద్యార్థులకు మార్చ్‌పాస్ట్ యూనిఫామ్‌ను చౌట్‌పల్లి ఉన్నతపాఠశాల విద్యార్థులకు రేయాన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ గడ్డం మహేందర్ రూ.35వేలతో కొనుగోలు చేసి బుధవారం విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోషణ్ అభియాన్‌లో భాగంగా బాల్కొండలో బుధవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను జిల్లా సంక్షేమాధికారి రసూల్‌బీ వివరించారు. ఉమెన్ కమిషన్ మెంబర్ సూదం లక్ష్మి, ఎంపీడీవో, తహసీల్దార్, సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ రమాదేవి ఏపీవో ఇందిరా, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు. - బాల్కొండ, సెప్టెంబర్ 25

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పంటను నమోదు చేస్తున్న అధికారులు

బాల్కొండ, సెప్టెంబర్ 25 : రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటంతో అద్భుతమైన పంట దిగుబడులను సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల వ్యవసాయాధికారి లావణ్య, ఏఈవో నిహారికతో కలిసి బోదేపల్లిలో వివిధ పంట క్షేత్రాలను పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను ప్రతిరోజు విధిగా పరిశీలిస్తూ ఉండాలని, ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల పరిధిల బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, అగ్గి తెగులు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా అయినట్లు తెలిపారు. తొలి దశలోనే గుర్తిస్తేనివారణ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని సూచించారు. ఆన్‌లైన్‌లో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

సంక్షిప్తంగా..

- **కోటగిరి ప్రభుత్వ కళాశాల తనిఖీ** - కోటగిరి, సెప్టెంబర్ 25 : కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో రవికుమార్ బుధవారం తనిఖీ చేసి, రిజిస్టరను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు. బదిలీ అయిన నలుగురు అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖైసర్‌పాషా, అధ్యాపకులు ఉన్నారు.
- **12వ బెటాలియన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన** - కంఠేశ్వర్, సెప్టెంబర్ 25 : జిల్లాకేంద్రంలోని నాగారం క్రీడా మైదానంలో వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన కేడెట్లకు ట్రాఫిక్ కానిస్టేబుల్ శివప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 12వ బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.
- **బీఎల్‌వోలతో సమావేశం** - కోటగిరి/ పొతంగల్, సెప్టెంబర్ 25 : ఓటరు జాబితా సవరణలో తప్పులు లేకుండా చూడాలని, 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలని తహసీల్దార్లు సూచించారు. కోటగిరి, పొతంగల్‌లో తహసీల్దార్లు గంగాధర్, మల్లయ్య బీఎల్‌వోలతో బుధవారం సమావేశం నిర్వహించి ఫారం 6,7,8తోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో గిర్దావర్ సయ్యద్ హుస్సేన్, వివిధ గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ** -మోర్తాడ్, సెప్టెంబర్ 25: మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం పీడీఎస్‌యూ స్వర్ణోత్సవసభ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ ఈనెల 30న ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహించే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ మహాసభకు విద్యార్థులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆ సంఘం మండలకన్వీనర్ మహేశ్, జిల్లా కోశాధికారి నిఖిల్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కిషన్, సత్తెక్క, సిద్ధు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.
- **విజయవంతం చేయండి**- మోర్తాడ్, సెప్టెంబర్ 25: ఈనెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించనున్న ఉద్యమకారుల ఆత్మీయసమ్మేళన కార్యక్రమానికి ఉద్యమకారులందరూ హాజరై విజయవంతం చేయాలని మోర్తాడ్ మండల ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. బుధవారం మోర్తాడ్‌లో ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నర్సయ్య, రాజారాం, బాబురావు, దశరత్, గంగాధర్, రాజన్న, రవి పాల్గొన్నారు.
- **సెల్‌ఫోన్ల అప్పగింత** - శక్కర్‌నగర్, సెప్టెంబర్ 25: బోధన్ పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి చోరీకి గురైన రెండు సెల్‌ఫోన్లను బుధవారం బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ యజమానులకు అప్పగించారు. బాధితులు గతంలో చేసిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ కనిపెట్టినట్లు తెలిపారు. బుధవారం రెండు సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.
- **భూమిపూజ**- నవీపేట,సెప్టెంబర్ 25: మండల కేంద్రంలో త్వరలో ప్రారంభం కానున్న దేవి శరన్నావరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలం ఏర్పాటుకు మండల కేంద్రంలో బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాకేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- **గుర్తు తెలియని మృతదేహం లభ్యం**- రెంజల్, సెప్టెంబర్ 25: మండలంలోని కందకుర్తి గోదావరినదిలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రెంజల్ పోలీసులు తెలిపారు. గోదావరి పుష్కరఘాట్ వద్ద ఒడ్డుకు చేరిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతుడి టీ షర్టుపై శంకర్ ఇంజినీరింగ్ నిజామాబాద్ అని ఉందని, ఆచూకీ తెలిస్తే పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.
- **చాకలి ఐలమ్మ జయంతి అధికారికంగా నిర్వహించడం హర్షనీయం**
శక్కర్‌నగర్, సెప్టెంబర్ 25: చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రకటన చేయడం హర్షనీయమని బోధన్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు కొన్నే వినోద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని బోధన్ ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్యదాముకు బుధవారం బహూకరించారు.
- **నిత్యావసర సరుకుల అందజేత** - మాక్లూర్, సెప్టెంబర్ 25: వెంకటాపూర్‌కు చెందిన దాదన్నగారి అమర్ తన మనుమడి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని పది మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. తన కుమారుడు, కోడలు అమెరికాలో స్థిరపడ్డారని వారి కోరిక మేరకు పేదలకు సరుకులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.
- **విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు**- ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్25: పట్టణంలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధ్యక్షుడు పుల్కం వేణు బుధవారం తెలిపారు. టూత్‌పేస్ట్‌లను అందజేసినట్లు తెలిపారు.
- **చిత్రలేఖనం పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి** - నందిపేట్, సెప్టెంబర్ 25: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన 6వ విద్యార్థిని బి.శ్రీవర్ధిని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామిజీ ఆధ్వర్యంలో శ్రీప్రజ్ఞ వికాస్ నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి మొదటి బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ అరుణ్, ప్రిన్సిపాల్ రవికిరణ్, అఖిల తెలిపారు.
- **పిల్లలకు టీకాలు వేయించాలి** - ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్25:జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గిరిబాబు సూచించారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.
- **ఉపాధ్యాయులకు అవగాహన** - ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్25:పాఠశాలలో విద్యార్థుల్లో వైకల్యాలను గుర్తించి ప్రశస్త యాప్‌లో నమోదు చేసే బాధ్యత హెచ్ఎంలతోపాటు ఆయా తరగతి ఉపాధ్యాయులపై ఉంటుందని సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావ్ తెలిపారు. పెర్కిట్‌లోని మాడల్ స్కూల్‌లో ఎంఈవో రాజగంగారాం ఆధ్వర్యంలో ఆర్మూర్,ఆలూర్ మండలాల హెచ్ఎంలకు ప్రశస్త యాప్‌లపై బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు.

పసుపు పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి


గుమ్మిర్యాల్‌లో పసుపు పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్గట్ల, సెప్టెంబర్ 25: వర్షం ప్రభావానికి గురైన పసుపు పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి రుద్ర వినాయక్, కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్ర వేత్త డాక్టర్ మహేందర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పసుపు పంటను రైతులతో కలిసి బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నేలల్లో నీరు నిలిచిందని, దీంతో పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. పంటకు నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు ఇచ్చారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★అనఘా షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎలక్ట్రీషియన్ (డిప్లొమ ఎలక్ట్రీషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్
NTZ-334461

BUSINESS OFFER
★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.